# ఔట్‌సోర్సింగ్ - మరోటి

ఔట్‌సోర్సింగ్ వల్ల సర్వే జనా సుఖినో భవంతు అని తెలుసుకున్నాం. కాకపోతే మీ వూళ్ళోనే, మీ అమెరికా దేశంలోనే ఆ ఔట్‌సోర్సింగేదో చేసుకోవచ్చు కదా... పరదేశాలకి ఎందుకు?... అనేది చివరి ప్రశ్న.

అయ్యో! అది చెప్పేముందు ఒక్క క్షణం ఆగండి. సర్వేజనా సుఖినోభవంతు అని ఎవరన్నారు? ఫలానా కంపెనీ ఔట్‌సోర్సింగ్ చేస్తే ఆ ఫలానా కంపెనీలో కొన్ని ఉద్యోగాలు పోతున్నాయని వారం రోజుల క్రితం మీరే అన్నారు కదా. మరెవరికి సుఖం?

పోతున్నయ్యంటే ఎక్కడికీ పోవటం లేదు. ఒక కంపెనినించీ అక్కడే ఇంకొక కంపెనీకి పోతున్నాయి. నిరుద్యోగులు బాగా తక్కువగావున్న అమెరికాలాటి దేశాలలో పెద్ద ఇబ్బంది కూడా ఏమీ లేదు.

ఆ ఉద్యోగాలు కూడా మరి ఈ ప్రపంచీకరణంలో కరణికాలలాగానే కాల చరిత్రలో కలిసిపోవటంలేదూ? ఉంది, లేదు. ఇది తెలుసుకునే ముందు అమెరికా గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అమెరికా మొదట్నించీ వలస వచ్చిన వారి దేశం. అంటే లాండ్ ఆఫ్ ఇమ్మిగ్రెంట్స్. అలా అలా ఇక్కడి ప్రజల సంఖ్య పెరుగుతూ 1980కి జనాభా 250 మిలియన్లు. అంటే 25 కోట్లకి పెరిగింది. అమెరికా వైశాల్యం ఇన్ని చదరపు మైళ్ళని చెప్పే బదులు, ఇండియాకన్నా దాదాపు మూడున్నర రెట్లు పెద్దది అని చెబితే బాగా అర్థమవుతుంది. జనాభా ఇండియా కన్నా దాదాపు నాలుగు వంతులు తక్కువ. అమెరికా ఇండియా దేశ జనాభా - వైశాల్యాల నిష్పత్తిని పోల్చి చూస్తే, ఇండియాలో ఒక చదరపు మైలుకివున్న మనుష్యుల కన్నా, అమెరికాలో దాదాపు 14 వంతులు తక్కువ వున్నారన్నమాట. అమెరికా పారిశ్రామికంగా ప్రపంచ దేశాలన్నిటికన్నా పెద్దది. ప్రొడక్టివిటీలో అంటే ఉత్పత్తిలో ముందు బెంచీలో వుంది. నిరుద్యోగులు తక్కువ. చాలరకాల ఉద్యోగాల్లో ఇక్కడ మనుష్యులు ఎక్కువమంది లేని కారణంగా నిపుణులు దొరకరు. అందుకే ఇతర దేశాల నించీ అంతమంది ఇక్కడికి ప్రతి ఏటా రావటం. ఇలా జనాభా పెరగటంవల్ల ఎనభైలలో 25 కోట్ల జనాభా, 90లలో 26 కోట్లు అయింది. అమెరికా చరిత్రలో ఇంత త్వరితమైన పెరుగుదల ఏనాడూ లేదు. అంతకుముందు టెంపరరీ వీసాల మీద అమెరికా వచ్చి కొన్నాళ్ళుండి వెళ్ళిపోయేవారు. కానీ తరువాత వెనక్కి తిరిగి వెళ్ళకుండా అమెరికాలోనే శాశ్వత నివాసులుగానో పౌరులుగానో వుండిపోతున్నారు. వారి దేశాలలో ఉద్యోగాలు లేకపోవటం, జీవన పరిస్థితులు అనుకూలంగా లేకపోవటం, వ్యాపార అవకాశాలు లేకపోవటం, అమెరికా జీవితం మీద మోజు కలగటం, రాజకీయ కారణాలు.. ఏమైనా కావచ్చు. కానీ జరిగింది, జరుగుతున్నది ఇది.

ఇలా ఇతర దేశాల వారు అమెరికా వచ్చి, అమెరికా జనాభాని పెంచే యటం కొన్ని రాజకీయ వర్గాల వారికి నచ్చలేదు. దేశ రాజకీయపరంగా వాళ్ళ కారణాలు వాళ్ళకి సబబుగానే వున్నాయి. అంతేకాకుండా దేశ ఆర్థిక పరిస్థితి బాగున్నప్పుడు లేని అభ్యంతరాలు, ఆ స్నేహపూరిత వాతావరణం ఆర్థికమాంద్యం వున్నరోజుల్లో వుండటం కష్టం. ఎందుకంటే అమెరికాలోనే పుట్టి పెరిగిన వాళ్ళకి ఉద్యోగాలు పోతున్నప్పుడు, బయటి దేశాలవాళ్ళు అక్కడే ఉద్యోగాల్లో సుఖంగా వుండటం – సగటు మనిషి భరించటం కష్టమైపోతుంది.

ఆర్థికపరిస్థితి బాగున్నప్పుడు పరిస్థితి ఇంకో రకమైన వాదనకి లొంగుతుంది. 26 కోట్ల మనుష్యులలోనూ పిల్లలనీ వృద్ధులనీ విద్యార్థులనీ ఉద్యోగాలు చేయనివారినీ మినహాయిస్తే, ఉద్యోగాలు చేసేవారు జనాభాలో సగానికన్నా తక్కువ. ఉద్యోగుల్లో కూడా షాపుల్లోనూ, మిగతా చిన్నచిన్న ఉద్యోగాల్లోనూ ఎన్నో కోట్లమంది అవసరం. వారు కాక రకరకాల పరిశ్రమలలోనూ, స్కూళ్ళల్లోనూ, హాస్పిటళ్ళలో చాలమంది కావాలి. అంతమంది మనుష్యులు ఈ దేశంలో లేరు. ఎక్కడ చూసినా కొరత కనిపిస్తూనే వుంటుంది. ఈ పరిస్థితుల్లోనే ప్రపంచీకరణం అక్కరకొచ్చింది. తక్కువ ఖరీదులో, నాణ్యత తగ్గకుండా ఎవరు ఏమందిస్తే అది కొనటానికి అమెరికా సిద్ధమయింది. డెభైలలో జపానూ, ఎనభైలలో సింగపూరూ తైవానూ హాంగ్‌కాంగ్, తొంభైలలో చైనా కొరియా మలేషియాలాటి దేశాలు ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదిగిపోయాయి. ఈరోజు ఇక్కడ దొరికే చిన్న వస్తువులనించీ, పెద్ద వస్తువుల దాకా అలాటి దేశాలనించే ఎక్కువగా వస్తుంటాయి.

అమెరికా ఏ కారణాల వల్ల ఔట్‌సోర్సింగ్ చేస్తున్నా దానివల్ల లాభం పొందుతున్న దేశాలు మాత్రం ఆర్థికంగా పుంజుకుంటున్నాయి. అమెరికా నించీ ఔట్‌సోర్సింగ్ మీద బాగా డబ్బులు చేసుకుంటున్న దేశాలలో ముఖ్యమైనవి, ఎగుమతి డాలర్ల పరంగా, చైనా తైవాన్ కొరియా జపాన్ సింగపూర్ మలైషియా ఇజ్రాయిల్ మెక్సికో కెనడా జర్మనీ మొదలైన దేశాలు. ఈమధ్య సాఫ్ట్‌వేర్‌లోనూ కాల్ సెంటర్లలోనూ ఇండియాకూడా అమెరికా దృష్టిలో పడింది. డాలర్లపరంగా మిగతా పై దేశాలతో పోలిస్తే ఇండియా ఇప్పుడిప్పుడే పైకి వస్తున్నా ఇంకా చాల చేయాల్సివుంది. ఈ మధ్య ఇన్ఫోసిస్ నారాయణమూర్తి చెప్పిన దాని ప్రకారం ప్రపంచ సాఫ్ట్‌వేర్ ఎగుమతులలో ఇండియా భాగం ఇంకా రెండు శాతంలోనే వుందనీ, మనమింకా ఎదగాలనీ అన్నారు.

మరి ఏ దేశ మేగినా, ఎందు కాలిడినా, ఎక్కడ చూసినా ఇండియన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కనపడతారే అని, మీలాటివారికీ నాలాటివారికీ వచ్చే ప్రశ్న. దానికి కారణం బహుశా మన దేశం సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్‌ల కన్నా, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్లనీ, ఇంజనీర్లనీ విదేశాలకి ఎగుమతి చేయటం కావచ్చును. ఇక్కడికి వచ్చే వారిలో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు తెలుగువారు. దానికి కారణాలు ఏమిటి? అక్కడ హైటెక్ మీద ప్రచారం జరిగినట్టుగా ఆచరణ మాత్రం జరగటం

లేదని ఇక్కడ అనుకోవటం కూడా వున్నాను. చాల అమెరికన్ కంపెనీలు బెంగుళూరు మద్రాస్ నోయిడాలాటి ప్రదేశాలకి వెళ్ళినంతగా ఆంధ్రదేశానికి వెళ్ళటం లేదని అంటున్నారు. నిజంగా ఆ కారణాలు నాకూ తెలిదు. మీరే చెప్పాల. దేశం ఆర్థికంగా బాగుపడాలంటే ఎగుమతి చేయవలసింది జనాభాని కాదు. ప్రొడక్టులని. సర్వీసులని. సాఫ్ట్‌వేర్‌లో ఇజ్రాయిల్ చేస్తున్నది అదే. సాఫ్ట్‌వేర్‌లో మా సహాయం కావాలంటే, మీరె మా దేశానికి రండి అంటుంది. అందుకేనేమో సాఫ్ట్‌వేర్ ఎగుమతులలో ఎంతో ముందుంది.

ఔట్‌సోర్సింగ్‌వల్ల అమెరికాకి అన్ని లాభాలు వుంటే, మరి మీ సుబ్బయ్యగారి కామాక్షి సంగతేమిటి?

చాల కంపెనీలు ఈవిషయంలో జాగ్రత్తగా వుంటున్నాయి. కేబుల్సూ, మెషీనింగ్ చేసిన భాగాలూలాటి చిన్న చిన్న పార్ట్సూ, కొన్ని చిన్న అసెంబ్లీలను ఒయటికి పంపిస్తున్నారు. ముఖ్యమైన భాగాలూ, కంపెనీ పరికరాల డిజైన్లని రహస్యంగా వుంచవలసిన భాగాలని అంటె ఇంటలెక్చ్యుయల్ ప్రాపర్టీని, ఔట్‌సోర్స్ చేయటంలేదు. చాలమందికి ఫలానాది తయారు చేస్తున్నామనే తెలుసు కాని, దాన్నెక్కడ ఎలా వాడతారో తెలియని పరిస్థితిలో, దాన్ని ఔట్‌సోర్స్ చేస్తున్నారు అందువల్ల కామాక్షి నేర్చిన పాఠాలు కంపెనీకి పంపించకుండా గుర్తుపెట్టుకుని ఈ ఔట్‌సోర్సింగ్ వ్యాపారం చేస్తున్నారు.

ఈ మధ్య అమెరికాలో ఔట్‌సోర్సింగ్ వల్లని, ఉద్యోగాలన్నీ బయటి దేశాలకి పోతున్నాయనీ మొత్తుకుంటున్నారేమిటి? అని చివరి ప్రశ్న.

దానికి కారణం ప్రస్తుతంవున్న ఆర్థికమాంద్యత. హైటెక్ బిజినెస్‌లోనూ, పెట్రోల్ వ్యాపారంలోనూ దెబ్బతిన్నది ప్రపంచం. అదీకాక టెర్రరిస్ట్ పనులు. ఈ ఆర్థికమాంద్యత అమెరికాలోనే కాదు అన్ని దేశాలలోనూ వున్నది. ఫలితంగా అమెరికాలో చాలమందికి ఉద్యోగాలు పోయాయి. వస్తువుల కొనుగోలు శక్తి హైటెక్ ఉద్యోగస్తులకి సహజంగా ఎక్కువ. వారికి ఉద్యోగాలు పోవటంతో ఆ కొనుగోలు తగ్గి, కిరాణా సామానుల దగ్గరనించీ ఇళ్ళు ఇంటికి కావలసిన సామాన్లు, మెషిన్లు, కార్లు అన్ని అమ్మకాలు తగ్గాయి దాంతో ఇంకా కొన్ని ఉద్యోగాలు పోయాయి. సాధారణంగా మూడు ఐదు శాతాల మధ్య వుండే నిరుద్యోగం. ఐదు-ఏడు శాతాల దాకా పోయింది. అందుకనే ఈ గొడవంతా. ఇప్పుడిప్పుడే ఆర్థికపరిస్థితి మెరుగుపడుతున్నది. చాల కంపెనీలు ఇప్పుడే నష్టాలను వదిలి లాభాలని చూపిస్తున్నాయి. మళ్ళీ ఉద్యోగాలు ఎక్కువవుతున్నాయి. అందులోనూ అమెరికాలో ఇది ప్రెసిడెంట్ ఎలక్షన్ల (2004) సంవత్సరం. కనీసం అందుకోసమైనా త్వరలో అన్నీ అవే సర్దుకుంటాయి. అప్పుడు ఎవరూ మళ్ళీ ఈ ప్రశ్న వేస్తారని నేను అనుకోను.

చూద్దాం ముందు ముందు ఎలా వుంటుందో,

* * *